హైదరాబాద్ వార్త



# మసకబారుతున్న బస్తీ దవాఖానాలు

**వైద్యుల నిర్లక్ష్యం, మందుల కొరత... పెద్దాసుపత్రులపై పెరుగుతున్న భారం..అత్యవసర రోగులకు తప్పని అవస్థలు**




**హైదరాబాద్, మే 24 ప్రభాతవార్త:** ప్రాథమిక వైద్యాన్ని పేదలకు మరింత చేరువ చేసేందుకు నెలకొల్పిన బస్తీదవాఖానాలు చిన్నబోతున్నాయి. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడికి సకాలంలో స్థానికంగా వైద్య సౌకర్యం పొందేలా బస్తీ దవాఖానాలు ఏర్పాటుచేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతి డివిజన్‌కు రెండు చొప్పున బస్తీ దవాఖానల పేరిట వైద్యసేవలను చేరువ చేసింది. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రులైన ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రులపై వత్తిడి తగ్గడం కోసం బస్తీ దవాఖానాలను ఏర్పాటు జరిగింది.అయితే గతంలో ఆరోగ్యకరంగా, వైద్య సేవలను అందించిన ఈ దవాఖానాలు నేడు అంతంత మాత్రంగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్తీ దవాఖానలకు వెళ్లిన రోగులకు వైద్య సేవలు కాకుండా గంటల సమయం పాటు వైద్యులు, నర్సుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగులకు అవసరమైన మందులుకూడా అందకపోవడంతో ఆస్పత్రులకు వచ్చే సంఖ్య నానాటికి తగ్గుతోంది. నగరంలో దాదాపు 3వందల వరకు ఉన్నబస్తీ దవాఖానలలో రోగులకు అవసరమైన మందులు లభించడం లేదని తెలుస్తోంది. బీపీ, షుగర్‌లతో పాటు మరికొన్ని జబ్బులకు అవసరమైన మందులు మాత్రమే లభిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బస్తీ దవాఖానల ఏర్పాటు లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకింది. ఇక్కడ లభించే సేవలు అంతంత మాత్రంగా ఉండడంతో రోగులు ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పెద్దాసుపత్రిలపై భారంపడి అక్కడ ప్రతి ఒక్కరికి సేవలు లభించడం ఇబ్బందికరంగా మారింది. పెద్దాసుపత్రులలో అత్యవసర రోగులకు సేవలు అందించడం కోసం వైద్య బృందం సిద్దంగా ఉన్నప్పటికి చిన్నచిన్న రోగాలకు జనాలు విపరీతంగా వస్తుండడంతో వైద్యులు ఇబ్బందిపడుతున్నారు. బస్తీ దవాఖానలో ప్రదర్శిస్తున్న వైద్యుల నిర్లక్ష్యం, లభించని మందులు, రోగ నిర్ధారణలో ఆలస్యం, అలసత్వం కారణంగా రోగులు పెద్దాసుపత్రులలో మెరుగైన వైద్యం లభిస్తుందని నమ్మకంతో వచ్చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ నుంచే కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లాలలోని ప్రజలు పెద్దాసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

**తెలంగాణ ప్రభుత్వం వచ్చాక...**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని హైదరాబాద్ నగరంలో బస్తీ దవాఖానల వ్యవస్థ ఏర్పాటు జరిగింది. డాక్టర్‌లు, నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు రోగులకు సేవలు అందించడం కోసం ఏర్పాటు జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 636 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4745 ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో కొని 24 గంటలపాటు వైద్య సేవలు అందించే కేంద్రాలు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 300 బస్తీ దవాఖానలు ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మళ్లీ 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వైద్యసేవలు అందిస్తారు. వీటిలో దాదాపు 135 రోగ నిర్ధారణ పరీక్షలు జరుపుతారు.ఇక్కడ రక్త నమూనాలను తీసుకుని వాటిని తెలంగాణ డయగ్నసిస్‌కు పంపిస్తారు. ఒకటి రెండు రోజుల లో టెస్ట్ రిపోర్టులు వచ్చిన అనంతరం రోగులకు అవసరమైన చికిత్సలు అందజేస్తారు. బస్తీ దవాఖానలో నిత్యం 80 నుండి వంద మంది వైద్య సేవలు పొందేవారు. అంతేకాకుండా ప్రతి గురువారం సీనియర్ సిటిజన్స్‌కు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ నిర్వహిస్తుంటారు. ఇందులో సీనియర్ సిటిజన్స్‌కు వారి అనారోగ్యాన్ని దూరం చేసేందుకు సలహాలు, అవసరమైతే యోగా లాంటివి పరిచయం చేయడం, వారి వారి కుటుంబ సభ్యులను పిలిపించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తారు. ఇంతపెద్ద వ్యవస్థ కొనసాగేది. కాని గత కొంత కాలంగా బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా సరైన వైద్య సేవలు అందక జనాలు పెద్దాసుపత్రులకు వస్తున్నారు. గ్రామాలలో, బస్తీలలో ఉన్న అస్పత్రులలో సరైన వైద్యం అందించగలిగితే ఉస్మానియా, గాంధీ లాంటి పెద్దాసుపత్రులపై భారం తగ్గుతుంది. ఈ లక్ష్యంతోనే బస్తీ దవాఖానల ఏర్పాటు కూడా జరిగింది.

**రోగులకు కిక్కిరిసిపోతున్న గాంధీ, ఉస్మానియా...**

అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలలో మెరుగైన వైద్య సేవలు అందించగలిగితే ఉస్మానియా, గాంధీలాంటి ఆస్పత్రులపై భారం తగ్గుతుంది. వాటికి కేవలం అత్యవసర పరిస్థితిలో ఉపయోగించుకోగలిగితే ఇప్పటి కంటే మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. ఓపీలోనే రోజుకు 2,500 నుండి 3వేల వరకు గాంధీ ఆస్పత్రికి వస్తున్నారు. అలాగే అత్యవసర సేవలకు రోజు 300 మంది వరకు వస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు పేర్కొంటున్నారు.వీరికి అవసరమైన వైద్య సేవలు అందించేలోపే వైద్యులకు ఉన్న సమయం సరిపోవడం లేదు. ఇక్కడ జరిపే టెస్టులు బస్తీ దవాఖానలలో జరిపి మెరుగైన వైద్య సేవలు అందించడం వల్ల పెద్దాసుపత్రులపై భారం తగ్గి అత్యవసర రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది.

# నీటితో కాసుల వేట!

- యథేచ్ఛగా అక్రమ నీటి వ్యాపారం
- అధికారుల కళ్లకు కనిపించని ఈ దందా
- మూసీ తీరం నుంచి పెద్దఎత్తున విక్రయం
- వాల్టా చట్టానికి అడుగడుగునా తూట్లు



**హైదరాబాద్, మే 24 ప్రభాతవార్త :** నగరంలో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులూ లేకుండా భారీగా బోర్లు వేస్తున్న కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ.. ఒక్కో రూపాయి పన్ను చెల్లించకుండా ప్రతి రోజూ రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు సంబంధిత విభాగాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ అక్రమ నీటి వ్యాపారం ఫలితంగా అనేక కాలనీల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. కాగా, గృహావసరాల కోసం బోరువేయాలన్నా కచ్చితంగా స్థానిక తహసీల్దార్ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఇలా వేసిన బోరు నీటిని కేవలం గృహ, వ్యక్తిగత అవసరాలకు మాత్రమే వినియోగించాలి. కనీసం ఒక్క ట్యాంకరైనా విక్రయించడానికి ఆస్కారం లేదు. ప్లాంట్ ఏర్పాటు చేసి, అనుమతి పొందిన తర్వాత శుద్ధి చేసిన తాగునీరు విక్రయించవచ్చు. ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్మాలంటే కచ్చితంగా భూగర్భ జల శాఖ వద్ద అనుమతి తీసుకోవాలి. ప్రస్తుతం ఇలా అనుమతి తీసుకున్న వ్యక్తులు,సంస్థలు కేవలం పదికూడా లేకపోవడం గమనార్హం. భూగర్భ జలాలు పరిమితంగా ఉన్నచోట ఇలా బోర్లద్వారా విక్రయానికి అనుమతి లభించదు. ప్రస్తుతం నగరంలో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా వందల అడుగుల బోర్లు వేసి ఆ నీటిని విక్రయిస్తున్న వాళ్లు వందల సంఖ్యలో ఉన్నారు.

**యథేచ్ఛగా 24 గంటలూ నీటి దందా...**

సాధారణ రోజుల్లో ఈ అక్రమ నీటి దందా పగటి వేళలో కంటే రాత్రి వేళల్లోనే ఎక్కువగా జరుగుతుంది. వేసవి కాలం వచ్చిందంటే చాలు అక్రమ వ్యాపారులు ట్యాంకర్ల ద్వారా 24 గంటలూ నీటిని తరలిస్తూనే ఉంటున్నారు. భారీ పరిమాణంతో బోర్లు వేసిన ఈ అక్రమార్కులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జనరేటర్లు వినియోగించి మరీ నీటిని తోడేస్తున్నారు. కనీసం ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించకుండా రూ.లక్షల్లో వ్యాపారం చేసేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను దాని పరిమాణాన్ని బట్టి రూ.2000 నుంచి రూ.4000 వరకు విక్రయిస్తున్నారు. రోజుకు కొన్ని వందల ట్యాంకర్ల నీరు ఇలా ట్యాంకర్ల ద్వారా నీటిని హోటళ్లు, లాడ్జిలు, అపార్టుమెంట్స్, హాస్టళ్లకు అమ్మేస్తున్నారు. ఉప్పల్ మండలంలో మూసీ తీరం వెంట అనేక చోట్ల ఈ అక్రమ నీటి వ్యాపారం జరుగుతోంది. అంబర్‌పేట శ్మశాన వాటిక కూతవేటు దూరంలోనే బోర్ల ద్వారా నీటిని తోడేసి ట్యాంకర్ల ద్వారా విక్రయించే దందా నడుస్తోంది. అలాగే అంబర్‌పేట గాంధీ బొమ్మ, శ్రీనగర్‌కాలనీ, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో జోరుగా ఈ వ్యాపారం సాగుతోంది.

**శివార్లలోనూ ఇదే దుస్థితి...**

అపార్ట్‌మెంట్‌లలో ఇష్టారీతిన బోర్లువేయడం, గేటెడ్ కమ్యూనిటీలలో నీటి వినియోగం పెరుగుతుండటంతో ఎద్దడి ఏర్పడుతోంది. మరోవైపు ఇంకుడు గుంతలు ఏర్పాటు, వినియోగం అంతంత మాత్రంగానే ఉండటంతో భూగర్భ మట్టాలు భారీగా తగ్గుతున్నాయి.

ఒకప్పటి శివారు ప్రాంతాలన్నీ ప్రస్తుతం నగరంలో అంతర్భాగమయ్యాయి. పంట భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. చెరువులు, కుంటలు దాదాపు కనుమరుగయ్యాయి. ఒకటి రెండు ఉన్నా వాటి చుట్టూ భారీ నిర్మాణాలు, సీసీ రోడ్లే. పూర్తిగా కాంక్రీట్ జంగిల్.. ప్రతి 25 నుంచి 50 ఫీట్ల దూరంలో ఒక బోరు బావిని తవ్వుతుండటం, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ భూమిలోకి నీరు ఇంకకపోవడం చెరువులు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరూ లేకపోవడంతో భూగర్భంలోని నీరు పాతాళానికి పడి పోయింది ప్రధానంగా శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, బోడుప్పల్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంకర్‌పల్లి, చేవెళ్ల, మెయినాబాద్, కొత్తూరు, శంషాబాద్ రాజేంద్రనగర్, కందుకూరు మండలాల్లో భూగర్భమట్టాలు బాగా పడిపోయాయి.

# ఆసక్తిఉన్న రంగాల్లోనే విద్యార్థులను ప్రోత్సహించాలి

**నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్**

**ముషీరాబాద్, మే 24, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఏ రంగాలలో ఆసక్తి ఉందో తల్లి తండ్రులు గమనించి, వారిని ప్రోత్సహించాలని నగర పోలీస్ కమీషనర్ సి.వి.సజ్జనార్ సూచించారు. ఆదివారం దోమలగూడలోని రామకృష్ణమఠంలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యుమన్ ఎక్స్‌లెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన 45రోజుల సంస్కార్ 2026 ముగింపు సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎంతో మంది తల్లి తండ్రులు తమ పిల్లలను పట్టించుకోకుండా, వారికి కావల్సినవి కొనివ్వటం తప్ప వారు ఏమి చేస్తున్నారో కూడా పట్టించుకోవటం లేదని, దీనివల్ల పిల్లలతో ఏమైనా చెడు సంఘటనలు జరిగితే పిల్లలతోపాటు తల్లి తండ్రులు కూడా ఇబ్బందుల పాలవుతున్నారని గుర్తు చేశారు. రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి, పిల్లల్లో మంచి ఆలోచనలు పెంపొందింప చేయటంతో పాటు జీవితంలో అనుకున్న లక్ష్యాలను విజయవంతంగా సాధించేలా తీర్చిదిద్దటం శుభపరిణామమన్నారు. రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ విశ్వాసం, ఆత్మ నిర్భరత, ఆత్మవిద్య, ఆత్మ క్రమ శిక్షణ వంటి నాలుగు అంశాలను పెంపొందించుకొని, మనిషిగా ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేశారు. కార్యక్రమంలో బి.పి.ఎన్.మూర్తి, సూర్యప్రకాష్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.




సంస్కార్ 2026 కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోలీస్ కమీషనర్ సజ్జనార్



సురేందర్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## బిఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించిన కెటిఆర్

**హైదరాబాద్ మే 24 ప్రభాతవార్త :** ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సురేందర్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త సురేందర్ అనారోగ్యంతో ఉన్నారని ఆయన కొడుకు ఉమాశంకర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చాడు. దీనికి కేటీఆర్ స్పందిస్తూ సురేందర్‌ను త్వరలోనే కలుస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు కేటీఆర్ ఆదివారం బర్కత్‌పురలోని వుడ్‌ల్యాండ్ హాస్పిటల్‌కు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేందర్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని హాస్పిటల్ ఎండి డాక్టర్ సురేష్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ సురేందర్ కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు ఉన్నారు.

## బద్రుకా కుటుంబ సభ్యులపై కేసు నమోదు

**- భూవ్యవహారంలో మోసం చేశారంటూ ఫిర్యాదు**

**జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త**

భూవివాదం, మోసం నేపథ్యంలో నగరానికి చెందిన ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన పలు వురిపై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. భూమి హక్కుల పేరుతో రూ.55 లక్షలు తీసుకుని మోసం చేశారని ఓ ప్రైవేట్ సంస్థ ప్రతినిధులు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. త్రూవిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమి టెడ్ సంస్థ ముసద్దీలాల్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమి టెడ్‌కు అనుబంధ సంస్థగా పనిచేస్తోంది. కాగా గోపాల్ లాల్‌బద్రుకా, ఆదిత్యబద్రుకా, శశిబద్రుకా, మురారిబద్రుకా, అవదేశ్‌బద్రుకా తదితరులు మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా దబీల్‌పుర గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 74 నుంచి 77, 673 నుంచి 687, 689 నుంచి 707 వరకు విస్తరించిన సుమారు 476.21 ఎకరాల భూమిపై తమకు చట్టబద్ధ హక్కులు ఉన్నాయని సంస్థ ప్రతినిధులకు నమ్మబలికారు.తాము బద్రుకా కుటుంబ సభ్యులమని పరిచయం చేసుకుంటూ, భూమిపై పూర్తి హక్కులు, మార్కెటబుల్ టైటిల్ తమదేనని హామీ ఇచ్చి జాయింట్ డెవలప్‌మెంట్, అమ్మకపు ఒప్పందాలపై చర్చలు జరిపారు. వారి మాటలను, హామీలను నమ్మి సంస్థ తరఫున మొత్తం రూ.55 లక్షలు వివిధ చెక్కుల రూపంలో వారికి చెల్లించారు. కాగా ఆ భూమిపై తీవ్ర వివాదాలు, కోర్టు కేసులు, యాజమాన్య వివాదాలు ఉన్నట్లు సంస్థ ప్రతినిధులు గుర్తించారు. అప్పటికే వివిధ రూపాలలో పెట్టిన ఖర్చులను తిరిగి ఇవ్వాలని పలుమార్లు అడిగినా, సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని చెప్పి కాలయాపన చేశారు. దీనికితోడు ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించడం మానేసి, సమావేశాలకు దూరంగా ఉంటూ డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకుంటున్నారు. సంస్థ ప్రతినిధి మోహన్‌రావు జూబ్లీహిల్స్‌లోని గోపాల్ లాల్ బద్రుకా నివాసానికి వెళ్లి డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, అవదేశ్ బద్రుకా దుర్భాషలాడి, దాడికి పాల్పడటమే కాకుండా గూండాలను పంపిస్తామని బెదిరించాడు. తమకు రాజకీయ పలుకుబడి ఉందని, చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మోసం, నమ్మకద్రోహం, కుట్ర, బెదిరింపులు, దాడి, నిధుల దుర్వినియోగంతో కంపెనీకి భారీ ఆర్థిక నష్టం, మానసిక వేధింపులు కలిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 665 మందిపై కేసులు

**హైదరాబాద్, మే 24 ప్రభాతవార్త :**

రోడ్డు భద్రతను పటిష్టం చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీ సులు నగరవ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక డ్రైవ్‌లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ మొత్తం 438 మంది డ్రైవర్లు పట్టుబడినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్‌కమిషనర్ డి.జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల సహించేది లేదన్నారు. ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 438 మందిలో ద్విచక్ర వాహనదారులే అత్యధికంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇందులో ద్విచక్ర వాహనాలు 365, త్రిచక్ర వాహనాలు (ఆటోలు) 25 మంది, నాలుగు చక్రాల వాహనాలు 47,ఒకటి ఇతర వాహనాలున్నాయి. అలాగే మల్కాజ్‌గిరి కమిషన్ పరిధిలో 227 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. మద్యం తాగి వాహనాలు నడపడంవల్ల మీ ప్రాణాలకే కాకుండా రహదారిపై ప్రయాణించే ఇతర అమాయకుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఆయన తెలిపారు. నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు, సురక్షిత ప్రయాణానికి వాహనదారులు, నగర ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలి జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జోయల్ డేవిస్ తెలిపారు.

**మెహదీపట్నం వద్ద స్కైవాక్, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపనుల నేపథ్యంలో**

## నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు

**హైదరాబాద్, మే 24 ,ప్రభాతవార్త**

మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కైవాక్ నిర్మాణ పనులు, అలాగే పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై సీసీటీవీ కెమెరా పోల్స్ ఏర్పాటు పనుల నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా సోమవారం సాయంత్రం 4 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రయాణంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా, సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626 ను సంప్రదించవచ్చని తెలిపారు. నగర ప్రజలు, వాహనదారులు ఈ ట్రాఫిక్ మళ్లింపులను గమనించి, ట్రాఫిక్ ఇబ్బందులు లేని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాల వివరాలు...

-మాసబ్ ట్యాంక్ నుండి రేతిబౌలి వైపు: మాసబ్ ట్యాంక్, ఎన్ఎండిసి, ఎస్‌డి కంటి ఆసుపత్రి వైపు నుండి రేతిబౌలి,నానల్‌నగర్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెం. 2,3 (అజీజియా మసీదు) వద్ద మెరాజ్ కేఫ్ మీదుగా కుడి వైపునకు మళ్లించి, మెహదీపట్నం పిల్లర్ నెం. 15 వద్ద సాధారణ మార్గంలోకి అనుమతిస్తారు.

- టోలిచౌకి, లంగర్‌హౌస్ నుండి మాసబ్ ట్యాంక్ వైపు: టోలిచౌకి, లంగర్‌హౌస్,అత్తాపూర్ నుండి నానల్‌నగర్ రేతిబౌలి మీదుగా మాసబ్ ట్యాంక్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెం. 23 వద్ద యూటర్న్ చేయించి, వ్యతిరేక దిశలో పంపి, అనంతరం పిల్లర్ నెం. 4, 5 వద్ద మళ్లీ సాధారణ మార్గంలోకి విలీనం చేస్తారు.

- మాసబ్ ట్యాంక్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వైపు: మాసబ్ ట్యాంక్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వైపు వెళ్లే వాహనాలను ఎస్‌డి కంటి ఆసుపత్రి వద్ద లక్ష్మీనగర్ రాంప్ (పిల్లర్ నెం.77) వైపునకు మళ్లిస్తారు.

- శంషాబాద్ విమానాశ్రయం నుండి మెహదీపట్నం వైపు: శంషాబాద్ విమానాశ్రయం నుండి మెహదీపట్నం వైపు వచ్చే వాహనాలు లక్ష్మీనగర్ రాంప్ (పిల్లర్ నెం. 88) వద్ద ఎగ్జిట్ తీసుకోవాల్సి ఉంటుంది. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై పనుల పురోగతిని బట్టి వాహనాలను ఆయా డౌన్ రాంపుల ద్వారా కిందకు అనుమతిస్తారు.

**హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో**

## అక్రమ బోర్‌వెల్స్‌పై జలమండలి చర్యలు

**హైదరాబాద్, మే 24 ప్రభాతవార్త :**

హిమాయత్‌సాగర్ జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమ బోర్‌వెల్స్‌పై జలమండలి చర్యలు తీసుకొంది. కొందరు వ్యక్తులు అక్రమంగా బోర్‌వెల్ తవ్వి భూగర్భ జలాలను వాణిజ్య అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న సమాచారం నేపథ్యంలో జలమండలి చర్యలు ప్రారంభించింది.

ఈ మేరకు హిమాయత్‌సాగర్ గ్రామ సమీపంలోని ఎఫ్‌టీఎల్ నంబర్లు 33, 34 పరిధిలో తనిఖీలు నిర్వహించగా, అక్రమంగా ఏర్పాటు చేసిన రెండు బోర్‌వెల్‌లు, నీటి సరఫరా వ్యాపారానికి వినియోగిస్తున్న ఒక నిల్వ ట్యాంక్‌ను గుర్తించారు. ఈ వ్యవహారంపై సంబంధిత వ్యక్తి బుచ్చిబాబుపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ వాణిజ్య నీటి కార్యకలాపాలు నిర్వహించినందుకు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 303(2) ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అలాగే, భవిష్యత్తులో హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ మరియు బఫర్ జోన్‌లలో ఇలాంటి అక్రమ బోర్‌వెల్‌లు తవ్వకం, భూగర్భ జలాల వినియోగం లేదా వాణిజ్య నీటి సరఫరా కార్యకలాపాలు గుర్తించిన పక్షంలో తక్షణ చర్యలు తీసుకోవాలని మొయినాబాద్, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల తహసీల్దార్లకు జలమండలి సమాచారం పంపింది.




హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా బోర్‌వెల్స్ ఏర్పాటుచేసిన దృశ్యం

వాల్టా చట్టంతో పాటు అమల్లో ఉన్న ఇతర చట్టాల ప్రకారం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు జలమండలి వెల్లడించింది.

## ఐ లవ్ యూ అంటూ హార్ట్ ఎమోజీలతో వైద్యురాలికి సందేశాలు

**- రోగి వ్యవహార శైలిపై ఫిర్యాదు చేసిన వైద్యురాలు**

**జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త :** 'ఐ లవ్ యూ డాక్టర్' అంటూ సందేశాలు, అసభ్యకర మెసేజ్‌లు, హార్ట్ ఎమోజీలు పంపుతూ ఒక మహిళా వైద్యురాలిని వేధిస్తున్న వ్యక్తిపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. బల్కంపేటలో నివసించే ఒక వైద్యురాలు గత ఏడాది మే 23న ఓ రోగికి లేజర్ పవర్ కరెక్షన్ శస్త్రచికిత్స నిర్వహించారు. వైద్యురాలి ప్రమేయం లేకుండా రోగి ఆమె వ్యక్తిగత మొబైల్ నంబర్ తీసుకున్నాడు. అర్ధరాత్రి వేళల్లో అనవసర సందేశాలు పంపడం ప్రారంభించాడు. గతేడాది అక్టోబర్‌లో వైద్యురాలికి ఐ లవ్ యూ డాక్టర్ అంటూ సందేశాలు పంపడంతో పాటు హార్ట్ ఎమోజీలు పంపాడు. దీంతో వైద్యురాలు ఆసుపత్రి హెచ్‌ఆర్ విభాగానికి ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనికితోడు వైద్యురాలు ఆ నంబర్‌ను బ్లాక్ చేశారు. ఇటీవల మరో మొబైల్ నంబర్ నుంచి మళ్లీ సందేశాలు పంపడం, సోల్ కాంట్రాక్ట్ పేరుతో వేధింపులకు గురిచేస్తూ హార్ట్ సింబల్స్, ఎమోజీలు పంపడం ప్రారంభించాడు. కాగా సందేశాలు పంపుతున్న వ్యక్తిని అంకిత్ వాల్తాటిగా గుర్తించి సంబంధిత స్క్రీన్‌షాట్లు, వివరాలను ఆస్పత్రి యాజమాన్యం, హెచ్‌ఆర్ విభాగానికి వైద్యురాలు అందజేశారు. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ల 78, 79, 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి తీవ్ర గాయాలు

**జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లో శనివారం రాత్రి రెండు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొన్నాయి. ఒక సంఘటనలో బెంజి కారు డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టి పరారవ్వగా, మరో సంఘటనలో మైనరు నడుపుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సనత్‌నగర్‌కు చెందిన డొడ్డి రూబెన్ జెబ్యులన్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన నేవీ నీలం రంగు మెర్సిడెస్ బెంజ్ కారు ఢీకొట్టి పరారైంది. ప్రమాదంలో రూబెన్‌కు తీవ్ర గాయాలు కాగా, ద్విచక్ర వాహనం, ల్యాప్‌టాప్ దెబ్బతిన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరో సంఘటనలో...**

జూబ్లీహిల్స్‌లోని శ్రీచైతన్య కాలేజ్ సమీపంలో టాటా నెక్సాన్ ఈవీ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. పోలీసుల విచారణలో భాగంగా 17 ఏళ్ల బాలుడు వాహనాన్ని నడిపినట్లు పోలీసులు గుర్తించారు. వేగం కారణంగా నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వాహనం యజమాని వద్ద పనిచేసే డ్రైవర్ బి.గణేష్‌రెడ్డి కారును తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. మైనర్‌కు వాహనం ఇచ్చినందుకు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హిట్ అండ్ రన్‌లో ఆటో డ్రైవర్ అరెస్ట్



అరెస్ట్ అయిన ఆటోడ్రైవర్ కిషన్

**జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త :** డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టి పరారైన ఆటో దారుడిని ఆదివారం బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారా హిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14 లోని టీఎస్ స్టడీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ట్రాఫిక్ పోలీసులను తప్పించుకొనే క్రమంలో కానిస్టేబుల్ శంకర్‌ను ఆటోతో ఢీకొట్టి పరారయ్యారు. ఈ సంఘటనలో కానిస్టేబుల్ శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సీసీ కెమెరా లను పరిశీలించి నిందితుడైన ఆటో డ్రైవర్ కిషన్‌ను అరెస్ట్ చేశారు. మద్యం మత్తులో ఈప్రమాదానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.



రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న నిత్యానందరావు, చిన్నారెడ్డి

## 28న సురవరం ప్రతాపరెడ్డి విగ్రహావిష్కరణ

**నాంపల్లి, మే 24 ప్రభాతవార్త :** తెలుగు భాషా సాహిత్య వికాసానికి విశేష కృషిచేసిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈనెల 28 మంగళవారం బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన సురవరం ప్రతాపరెడ్డి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించాలని విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు కోరారు. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంబంధిత ఆహ్వానపత్రికను తెలుగు సాహిత్యం, జర్నలిజం, చరిత్ర పరిశోధనరంగాల్లో చేసిన సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఆయన విగ్రహాన్ని విశ్వ విద్యాలయంలో ప్రతిష్టిస్తున్నట్లు ఉపాధ్యక్షుడు వివరించారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విశ్వవిద్యాలయం అన్ని ఏర్పాటు చేపడుతున్నట్లు ఆచార్య నిత్యానందరావు వెల్లడించారు.

## తమిళనాడు మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



తమిళనాడు మంత్రి విశ్వనాథన్‌కు అభినందనలు తెలుపుతున్న శ్రీగణేష్

**కంటోన్మెంట్, మే 24 ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పెరుమాళ్ విశ్వనాథన్‌ను ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించేలా మీ అనుభవ సారంతో తమిళనాడు ఉన్నత విద్యారంగం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డిలని కలిసి అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి శ్రీవారి దేవాలయంలో వసంతోత్సవం

**సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం నుంచి వసంతోత్సవం కార్యక్రమాన్ని 4 రోజుల పాటు ఘనంగా జరుగుతుందని టిటిడి ఎఈవో యు. రమేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, సన్నాయి మేళాల నడుమ అంకురార్పణ కార్యక్రమంతో వసంతోత్సవం ప్రారంభమవుతుందన్నారు. మంగళ, బుధ, గురువారాల్లో ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఊయ్యాల సేవ, 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామి వారికి తిరుచ్చి సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు తీర్థప్రసాదాలతోపాటు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టవర్‌ను తొలగించాలంటూ బస్తీవాసుల నిరసన




రోడ్డుపై నిరసన తెలుపుతున్న బస్తీవాసులు

**యూసుఫ్‌గూడ, మే 24 ప్రభాతవార్త :** అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తూరు సీతయ్యనగర్ బస్తీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తిపై సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తుండటంతో బస్తీవాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఆ టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు. స్థానికంగా ప్రైమరీ ప్రభుత్వ పాఠశాల ఉండటంతో చిన్నపిల్లలకు, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రభావం ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. అయితే సదరు ఇంటి నిర్మాణదారుడు ఇంటిపై టవర్‌ను ఏర్పాటు చేస్తుండగా స్థానికులు అతన్ని సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని ఆ భవనానికే జీహెచ్‌ఎంసీ అనుమతులు లేవని ఆపై టవర్‌ని ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్నాడని వెంటనే అధికారులు తగిన విధంగా సమస్యను పరిశీలించి టవర్‌ను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

**నిజాంపేట్, మే 24, ప్రభాతవార్త :** బాచుపల్లి హిల్ కౌంటీ ఎదురుగా ఉన్న దాదాపు 11 ఎకరాల విస్తీర్ణంగల పత్తికుంట చెరువు పరిరక్షణకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 వరకు మంచినీటి చెరువుగా ఉన్న పత్తికుంట ప్రస్తుతం పూర్తిగా కాలుష్యానికి గురవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పాటైన అనంతరం పై ప్రాంతాల నుండి వచ్చే డ్రైనేజ్ నీటిని పైప్‌లైన్ ద్వారా చెరువులోకి మళ్లించడం వల్ల చెరువు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సంవత్సరం పొడవునా డ్రైనేజ్ నీరు చేరడం కారణంగా గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి, దుర్వాసన వ్యాపిస్తూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెరువులోకి డ్రైనేజ్ నీరు చేరకుండా తక్షణమే పైప్‌లైన్‌ను రాజీవ్ గాంధీ నగర్ వరకు పొడిగించి మళ్లించాలని కోరారు. అలాగే చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు చేపట్టి చెరువును పునరుద్ధరించాలని సూచించారు. ఈ సమస్యపై సిఎంసీ నిజాంపేట్ సర్కిల్ అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి వెంటనే చర్యలు ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హనుమయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.



చెరువులో పేరుకుపోయిన మురుగు నీరు, చెత్త

# నిజమైన ఓటర్లకు న్యాయం జరిగేలా చూడాలి

### ఎస్ఐఆర్ జోనల్ ఇన్‌చార్జ్ మర్రి శశిధర్‌రెడ్డి

**అత్తాపూర్ మే 24, ప్రభాతవార్త :** నిజమైన ఓటర్లకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్ఐఆర్ జోనల్ ఇన్‌చార్జ్ మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ బిఎల్ఏ 2 సమావేశం ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు కీలక పాత్ర పోషిస్తారని ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి, ప్రతి ఓటరు వివరాలను వ్యక్తిగతంగా ధృవీకరిస్తారని ఇప్పటికే ఓటరుగా ఉన్నవారు తమ వివరాలను ధృవీకరించుకోవడానికి, కొత్త ఓటర్లు నమోదు కోసం ఫారం 6 నింపాలి. లేదంటే తొలగించడానికి, మార్పులు చేర్పులకోసం ప్రత్యేక ఫారాలను నింపాలని చర్చించారు. ఎస్ఐఆర్ జోనల్ ఇంచార్జ్ మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ...చివరిసారిగా 2002 - 2004 మధ్య చాలా రాష్ట్రాల్లో ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించిందని ఆ రివిజన్‌ను ఇప్పుడు పరిగణనలోకి తీసుకుని పోల్చిచూస్తారని చివరి ఇంటెన్సివ్ రివిజన్ జాబితాలో తమ పేర్లు లేనివారు లేదా వారి తల్లి దండ్రుల పేర్లు లేనివారు తమ భారత పౌరసత్వం, వయస్సును రుజువు చేసే పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి.. విచారించి.. పరిష్కరిస్తారని అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారని నిజమైన ఓటర్లకు న్యాయం జరిగేలా బిజెపి నేతలు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మల్లారెడ్డి, వై.శ్రీధర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, వనితరెడ్డి, సదానంద్, కడెం సుధాకర్, జయనంద్‌రెడ్డి, బాబురావు, నిఖిల్, విక్రమ్ చారి, రవి, వెంకటేష్, సందీప్ ముదిరాజ్, ఆనంద్, వెంకట్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, పద్మావతి, సరితరెడ్డి, అనురాధ, కవిత, సప్నా రెడ్డి, అమర్, శ్రీనివాస్, విజయ్, శివ, షేక్ బాషా, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

## ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

**సంజీవరెడ్డినగర్, మే 24, ప్రభాతవార్త:** క్రీడల అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడంలో తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ పోటీలను ఆయన మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యవంతులుగా ఉండటమే కాకుండా సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయన్నారు. ఇలాంటి పోటీలను వేదికగా చేసుకొని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, రాజేష్‌ముదిరాజ్, జమీర్, బాలరాజ్ పాల్గొన్నారు.

## గూడెపు వెంకన్నకు నివాళి

**నిజాంపేట్, మే 24, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కౌసల్యా కాలనీకి చెందిన గూడెపు రవీంద్రనాథ్ తండ్రి గూడెపు వెంకన్న ఇటీవల స్వర్గస్తులైన సందర్భంగా, ఆదివారం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన దశదిన కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గూడెపు వెంకన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపాన్ని తెలియజేశారు.

## కొత్త సంజీవరెడ్డికి నివాళులు

**కంటోన్మెంట్, మే 24 ప్రభాతవార్త:** ఆర్టీసీ మాజీ చైర్మన్, మహేంద్రహిల్స్ రవి కాలనీ సొసైటీ అధ్యక్షుడు కొత్త సంజీవరెడ్డి ప్రజలకు, కాలనీవాసులకు చేసిన సేవలు ఎనలేనివని తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో డైరెక్టర్ జి.సంపత్ కుమార్, ఇంటలిజెన్స్ ఐజీ శివకుమార్, కాలనీ ఉపాధ్యక్షులు కె.చంద్ర మోహన్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రవి కాలనీలో నివాసం ఉంటున్న ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి ఈ నెల గుండెపోటుతో మృతి చెందిన సందర్భంగా ఆదివారం రవి కాలనీ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో వారు పాల్గొని మహేంద్రహిల్స్‌లోని కాలనీల అభివృద్ధికి, రాష్ట్ర ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రవి కాలనీ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రావ్, ప్రశాంతిలక్ష్మి, డాక్టర్ నవీన్, గోపాల్‌రెడ్డి, నర్సింగ్ రావ్, మల్లయ్య, సదానందరావ్, మోహన్‌రెడ్డి, సదాశివరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తసంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బిఆర్ఎస్ హయాంలోనే పాతబస్తీ అభివృద్ధి

**చార్మినార్, మే 24 ప్రభాతవార్త :** పాతబస్తీ బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి సాధించిందని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంఛార్జి అలీ బిన్ ఇబ్రహిం మస్కతి అన్నారు. అలీజాకోట్లలో చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి అలీ మస్కతి, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ మాజీ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్, మాజీ సెట్విన్ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీలు కలిసి పాతబస్తీలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు గురించి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అలీ బిన్ ఇబ్రహిం మస్కతి మాట్లాడుతూ చార్మినార్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషీ, మల్లిఖార్జున్ యాదవ్, గోపి గౌడ్ పాల్గొన్నారు.



చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఇంచార్జి అలీ మస్కతి



పోలీసులను సత్కరిస్తున్న సన్‌రైజర్స్ టీమ్ ప్రతినిధులు

## ఉప్పల్ పోలీసులకు సన్‌రైజర్స్ క్రీడాకారుల సత్కారం

**ఉప్పల్, మే 24 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల సందర్భంగా పటిష్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పలువురు పోలీసు సిబ్బందిని సన్‌రైజర్స్ టీమ్ క్రీడాకారులు, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు చిరంజీవి, మధు, హెడ్ కానిస్టేబుల్ జంగయ్యలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ క్రికెటర్లు అభిషేక్ శర్మ పాల్గొని పోలీసుల సేవలను అభినందించారు. మ్యాచ్‌ల సందర్భంగా భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, ఉప్పల్ జోన్ డిసిపి సురేష్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఎసిపి వెంకట్ రెడ్డి, సిఐ వై.రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రశాంతంగా ముగిసిన యూపిఎస్‌సి పరీక్ష

**కంటోన్మెంట్, మే 24 ప్రభాతవార్త:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తిరుమలగిరి, పికెట్‌లలోని కే.వి.స్కూల్స్, బేగంపేట్ సికింద్రాబాద్ కళాశాలల్లో ఆదివారం నిర్వహించిన యూపిఎస్‌సీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అయా ప్రాంతాల్లో నిర్వహించిన పరీక్ష కేంద్రాల వద్ద బారీ పోలీస్ బస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులకు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ప్రధాన కూడలీల వద్ద బారీ పోలీస్ బందో బస్తును ఏర్పాటు చేసినట్లు తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్ తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**చార్మినార్, మే 24 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి చంద్రశేఖర్ అన్నారు. శాలిబండ డివిజన్ పరిధిలోని అలియాబాద్, షంషేర్‌గంజ్ బస్తీలలో మంచి నీటి బోరింగులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ అధికారులకు చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

## నల్లకుంట శంకర్ మఠంలో మజ్జిగ పంపిణీ

**చిక్కడపల్లి, మే 24 (ప్రభాతవార్త) :** ప్రజలు సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి గండె సుధాకర్ అన్నారు. ఆదివారం హ్యాపీ వాకర్స్ క్లబ్, అవోపా హైదరాబాద్, గాయత్రి మహిళా వాకర్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నల్లకుంట శంకర్ మఠంలో ఏర్పాటు చేసిన కొర్ర ఉప్మా, అంబలి, రాస్నా, మజ్జిగ పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వేసవికాలంలో దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛందసంస్థలు, క్లబ్‌లు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఏ.రామలింగేశ్వర రావు, ఏరియా 3 ఉపాధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, గాయత్రీ మహిళా వాకర్స్ క్లబ్ ప్రధానకార్యదర్శి ఎస్.సుజాత, ఎన్.రాజశేఖర్, లింగాప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ జస్టిస్ చంద్రయ్యకు ఘన నివాళులు

**జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త :** హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ చంద్రయ్యకు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జస్టిస్ చంద్రయ్య మృతి నేపథ్యంలో సంతాపసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్ హాజరై చంద్రయ్య చిత్రపటంవద్ద నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈటెల రాజేందర్ తదితరులు

# మహేష్‌కుమార్‌గౌడ్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

**సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త:** తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌పై ఒక ఛానల్ చేసిన అసత్య వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ హెచ్చరించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్ పలువురు బిసి నేతలతో కలిసి మాట్లాడుతూ రెండు రోజులుగా ఆ ఛానల్ మహేష్‌కుమార్‌గౌడ్‌పై చెడు ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. 35 సంవత్సరాలుగా ఆయన కాంగ్రెస్ పార్టీకి విశేషమైన సేవలు అందిస్తూ వస్తున్నారని, గడిచిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఆనేక తప్పులు చేసినప్పటికి ఆ ఛానల్ యాజమాన్యం పట్టించుకోకుండా కేవలం బిసి సామాజిక వర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను టార్గెట్ చేసిందని ఆరోపించారు. మహేష్‌కుమార్‌గౌడ్ తనకు ఉన్న 11 ఎకరాల భూమిని ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు దానం చేసిన చరిత్ర ఉందన్నారు. బిసి నేతలు అయిలీ వెంకన్న గౌడ్, అంబాల నారాయణగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, భైరీ శేఖర్ తదితరులు మాట్లాడుతూ మహేష్ కుమార్‌గౌడ్‌పై విమర్శలు చేయడం బిసిల ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయమని, ఆ ఛానల్ అసత్య ప్రచారాలను అపకపోతే సహించేది లేదని, ఛానల్ యాజమాన్యం తక్షణమే ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఛానల్ భవనాన్ని ముట్టడించి భౌతికంగా దాడులు చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.




మాట్లాడుతున్న బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్

## భగీరథ్ కేసులో బండి సంజయ్‌కు సంబంధం లేదు




మాట్లాడుతున్న కుమార్‌చౌదరి

**సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త:** బండి భగీరథ్ కేసు విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఎలాంటి సంబంధం లేదని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గొంటి కుమార్ చౌదరి స ్పష్టం చేశారు. బండి భగీరథ్ కేసు విచారణ దశ కోర్టు పరిధిలో ఉందని, దీన్ని రాజకీయం చేయడం సరికాదని, ఈవిషయాన్ని కోర్టు, రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని ఆయన చెప్పారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ చిన్నతనం నుంచి ఎంతో కష్టపడి అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి స్థాయికి ఎదిగారని దీన్ని జీర్ణించుకోలేని బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కుట్ర పన్నుతుందని, మరి కొందరు వ్యక్తులు రకరకాల వ్యాఖ్యలు చేస్తూ ఆయన్ని మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో చట్టాలు, కోర్టులు ఉన్నాయని, వాటి పని అవి చేసుకుంటూ పోతాయని, ఈ విషయాలు తెలిసి కూడా కొంత మంది కావాలనే బండి సంజయ్ ప్రతిష్ట దెబ్బ తీయడానికి ఆరోపణలు చేశారని, ఆయన్ని అభాసుపాలు చేసే విధంగా పన్నాగాలు పన్నారని ఆరోపించారు. ఇది న్యాయం కాదన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. రాజకీయ పార్టీలు కుటుంబాల విషయాల్లో జోక్యం చేసుకుని రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు.

## కలుషిత నీటి సరఫరా.. ఇబ్బందుల్లో ప్రజలు



పర్వత్‌నగర్‌లో మంచి నీటి పైప్‌లైన్‌లో సరఫరా అయిన కలుషిత నీరు

**యూసుఫ్‌గూడ, మే 24 ప్రభాతవార్త :** అసలే ఎండా కాలం తాగేందుకు గుక్కెడు నీరు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మంచి నీటి పైపుల ద్వారా సరఫరా అయ్యే నీరు కాస్త కలుషితం కావడంతో ప్రజలు మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ బస్తీలో రెండు రోజులుగా పైప్‌లైన్ ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుంది. తాగేందుకు స్థానికులు నీటిని పట్టుకోగా దుర్వాసన వస్తుండడంతో వెంటనే ఈ విషయాన్ని వాటర్‌బోర్డు సీఎమ్‌డీ అశోక్‌రెడ్డికి, జీఎమ్ హరిశంకర్‌కు, డీజీఎమ్ త్రినాథ్‌కు, మేనేజర్ అన్విత్‌తో మాట్లాడటం జరిగిందని లోక్‌సత్తా పార్టీ నేత వంశీప్రసాద్ తెలిపారు. అయితే మేనేజర్ సమస్యఉన్న ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారని, అయినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. బస్తీలో నీటి సరఫరాలో అంతరాయం తీవ్రంగానే ఉందని నామమాత్రంగా వాటర్ ట్యాంకర్లను పంపిస్తున్నప్పటికీ ప్రజలకు సరైన విధంగా నీరు సరిపడా సరఫరా కావడం లేదని మరికొంత సమయాన్ని పెంచి నీటి సరఫరా చేయాలని కోరారు.

## బాటసారులకు మజ్జిగ పంపిణీ..

**జీడిమెట్ల, మే 24, ప్రభాతవార్త :** స్వర్గీయ సుశీలమ్మ జ్ఞాపకార్థం అన్నదమ్ములు కలిసి ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తమ వంతు సహాయంగా మజ్జిగ పంపిణీని చేపట్టారు. వారి కుమారుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎండలు తగ్గే వరకు ప్రతిరోజూ వివిధ కూడళ్లు, చౌరస్తాల్లో ప్రజలకు మజ్జిగ అందించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఆదివారం సూరారంకాలనీ హోమ్ జెండా వద్ద, సూరారం చౌరస్తా సహా పలు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా పేపర్ గ్లాసులను వినియోగించారు. ఈ కార్యక్రమంలో ఆత్నూర్ మండల మాజీ ఎంపీటీసీ వీరేశం, సూరారం గ్రామ మాజీ వార్డ్ మెంబర్ బైండ్ల నరసింహ పాల్గొన్నారు. అప్పటి గ్రామపంచాయతీలో సర్పంచ్‌తో పాటు ఎనిమిది మంది సభ్యుల్లో ప్రస్తుతం జీవించి ఉన్న ఏకైక వ్యక్తి నరసింహ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ : బిక్షపతి యాదవ్

**నిజాంపేట్, మే 24, ప్రభాతవార్త :** వర్షపు నీరు ప్రకృతి మానవాళికి అందించిన అమూల్యమైన వరమని, ప్రతి నీటి చుక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని లక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బిక్షపతి యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల ప్రజలు తీవ్ర నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వేసవి కాలంలో తాగునీటి కోసం ప్రజలు వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాకాలంలో వృథాగా మురుగు కాలువల్లో కలిసిపోతున్న నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి పంపిస్తే భవిష్యత్తులో నీటి కొరతను కొంతవరకు తగ్గించవచ్చని తెలిపారు. ఇంటి ఆవరణలో లేదా బోరు సమీపంలో ఇంకుడు గుంతలు నిర్మించి పైకప్పు నుంచి వచ్చే వర్షపు నీటిని వాటిలోకి మళ్లించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఈ గుంతలను నిర్మించవచ్చని, ప్రభుత్వం కూడా ఇందుకు సబ్సిడీలు అందిస్తోందన్నారు. ప్రజలు నీటి పొదుపుపై అవగాహన పెంచుకుని ప్రతి నీటి చుక్కను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బును నీళ్లలా ఖర్చు చేయడం మాత్రమే కాదు, ఇకపై నీళ్లను డబ్బులా పొదుపు చేయడం కూడా నేర్చుకోవాలి అని బిక్షపతి యాదవ్ అన్నారు. తమ ఎల్జీఎఫ్ సంస్థ ద్వారా ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పేదలకు దుస్తులు పంపిణీ

**అఫ్జల్‌గంజ్, మే 24 ప్రభాతవార్త:** మారుతున్న కాలంలో పూర్వీకులను గుర్తు పెట్టుకుని దానధర్మాలు చేయడం ఎంతో సంతోషదాయకమని మాజీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తండ్రి భీమ్‌సేన్ జైస్వాల్ జ్ఞాపకార్థం గౌలిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని పేదలకు దుస్తువులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇచ్చిన జన్మతో ప్రతి ఒకరు సమాజంలో ఎంతోపేరు ప్రఖ్యాతలు సంపాదిస్తారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవాన్ని కాపాడినప్పుడే జన్మకు సార్థకత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజుయాదవ్, రవిజైస్వాల్, అశోక్ జైస్వాల్, అనిల్‌యాదవ్, సందీప్‌జైన్, అమిత్, రోషన్, సాయిరామ్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను మోసం చేస్తే మరో ఉద్యమం తప్పదు

**గోషామహల్, మే 24 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ప్రతి నెల 25 వేల పెన్షన్‌ను ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్, తెలంగాణ ఉద్యమకారుడు ఆర్వీ మహేందర్‌కుమార్ డిమాండ్ చేశారు. కోఠిలో ఏర్పాటు చేసిన ఉద్యమ కారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటవల సీనియర్ నాయకులు మాజీ రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు ఆద్వర్యంలో 5మ్యాన్ కమిటి ఏర్పాటు చేశారు. ఐదుగురు కమిటి సభ్యుల కమిటి ఇప్పటి వరకు ఎలాంటి కార్యచరణ మొదలు పెట్టలేదన్నారు. 33 జిల్లాల ఈ కమిటి సభ్యులు వెళ్లి జిల్లాల వారిగా సమాచారం సేకరిస్తామంటున్నారు. ఎప్పటిలోగా పూర్తిచేసి ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, నెల 25వేల పెన్షన్ ఇస్తారని అన్నారు. నిజంగా ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏమన్నా చేయాలనే ఉద్దేశ్యం ఉందా, లేక కాలయాపన కోసం కమిటి వేశారని ప్రశ్నించారు. వీలైనంత తొందరలో మాజీ రాజ్యసభ్యులు కె.కేశవరావు ఆద్వర్యంలో వేసిన 5గురు సభ్యులు తెలంగాణ వ్యాప్తంగా తిరిగి ఉద్యమకారుల జాబితాను రూపొందించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమకారులతో కలిసి పెద్ద ఎత్తున్న ఆందోళనచేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఉద్యమకారుడు ఆర్వీ మహేందర్‌కుమార్

# ఇల్లీగల్ పై గల్లీ గల్లీ వేట..

## 100 మందికి పైగా సిబ్బందితో పోలీస్ వ్యూహం

**55 ద్విచక్ర వాహనాలు సీజ్**

**మద్యం సీసాలు, నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం**

**రౌడీషీటర్లకూ కౌన్సెలింగ్**

**వికారాబాద్, మే 24, ప్రభాతవార్త:** వికారాబాద్ పోలీసులు ఆదివారం భారీ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా, ఈ తనిఖీలు తెల్లవారుజామున 5:00 గంటల నుండి ఉదయం 7:00 గంటల వరకు దాదాపు రెండు గంటల పాటు ముమ్మరంగా కొనసా గాయి. ఈ విస్తృత తనిఖీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి పోలీస్ శాఖ ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా తొమ్మిది కట్ఆఫ్ పార్టీలు, ఐదు సెర్చ్ పార్టీలు, ఐదు లిఫ్టింగ్ పార్టీలతో పాటు, హోల్డింగ్ పాయింట్ వద్ద బలమైన బందోబస్తు ఏర్పాట్లను మోహ రించారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది సబ్ఇన్‌స్పెక్టర్లు, 100 మందికి పైగా పోలీస్ సిబ్బంది చురుగ్గా పాల్గొ న్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేర స్థుల కదలికలపై నిఘా పెట్టారు. కాలనీలను చుట్టుముట్టి, సరైన పత్రాలు లేని వాహనాలు, అసాంఘిక శక్తులు, లేదా అక్రమంగా నిల్వ ఉంచిన వస్తువులను తనిఖీ చేశారు. స్థానికంగా ఉండే శాంతిభద్రతల సమస్యలు, తాగుబోతుల గొడవలు, వేధింపుల వంటి విషయాలను నేరుగా ప్రజల నుంచి తెలుసుకునే ప్రయత్నం చేశారు. నేరుగా కాలనీలు బస్తీలకు వెళ్లి పోలీసుల పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టే ప్రయత్నం చేశారు. సైబర్ నేరాలు, గంజాయి/డ్రగ్స్ రవాణా, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ తనిఖీల్లో భాగంగా, గరీబ్ నగర్ ప్రాంతంలో సరైన పత్రాలు లేకుండా అనుమానాస్పదంగా తిరుగుతున్న 55 ద్విచక్ర వాహనాలను పోలీ సులు సీజ్ చేశారు. వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అసలు పత్రా లను సమర్పించి, తదుపరి చట్టపరమైన ప్రక్రి యల తర్వాతే వాహనాలను అప్పగిస్తామని పోలీ సులు స్పష్టం చేశారు. అలాగే, ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన పెద్ద ఎత్తున మద్యం సీసాలు, నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసు కున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను పర్యవేక్షించడంలో భాగంగా, అదే ప్రాంతంలో నివసిస్తున్న ఐదుగురు రౌడీషీటర్లను గుర్తించి హోల్డింగ్ పాయింట్‌కు పిలిపించి కౌన్సె లింగ్ ఇచ్చారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, వారి ఆధార్ కార్డులను పరిశీలించి, పాపిలాన్ డివైజ్ ద్వారా వారి వేలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ డీఎస్పీ అంజయ్య మాట్లాడుతూ, ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజల్లో భయాందోళనలు సృష్టించినా సహించేది లేదని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని, కాలనీల్లో ఎలాంటి అనుమా నాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించినా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రజల రక్షణ, భద్రత కొరకు ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిఎస్పీ అంజయ్య

# ధాన్యం కొనుగోళ్లపై ఆందోళన అవసరం లేదు

**పెద్దేముల్, మే 24, ప్రభాతవార్త:** గన్ని బ్యాగుల, లారీల కొరత లేదని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ప్రతి చివరి గింజ వరకు దాన్యం కొనుగోలు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కొంత గన్ని బ్యాగుల, లారీల కొరత వల్ల తమ ధాన్యాన్ని తూకం చేయడంలేదని, వర్షం పడితే అపార నష్టం వాటిల్లె ప్రమాదం ఉందని రైతులు విన్నవించగా ఎమ్మెల్యేపై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గన్ని బ్యాగుల, లారీల కొరత లేకుండా చూడాలని సంబందిత అధికారులకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతు దేశానికి వెన్నముఖ అని, వారి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.రైతు సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా కల్పించారు. రైతులు ఇబ్బందులు పడకుండా దాన్యం కొనుగోళ్ళను మరింత వేగవంతం చేయాలని తాండూరు డిసిఎంఎస్ ఇంచార్జ్ సలాంపాషను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, టీపీసీసీ కన్వీనర్ యండి. రియాజ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు శోభారాణి, మండల పార్టీ అధ్యక్షులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, నాయకులు ఉప్పరి మల్లేశం, జి.క్రిష్ణరెడ్డి, కోటపల్లి బందెన్న, పి.ప్రకాశం, బోయిని నారాయణ, మైపూస్, తాండూరు డిఎస్‌పి నర్సింగ్ యాదయ్య, సీఐ ప్రవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయాధికారి హఠాన్మరణం

## గుండెపోటుతో కుప్పకూలిన వీరస్వామి



వీరస్వామి

**కుల్కచర్ల, మే24, ప్రభాతవార్త:** గుండె పోటుతో మండల వ్యవసాయ అధికారి మృతి చెందాడు. కుల్కచర్ల మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న వీరస్వామికి అదివారం ఉదయం గుండె పోటు వచ్చింది. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమిం చడంతో హైదరాబాద్ ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వీరస్వామి మృతి చెందాడు. వీరస్వామి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్, రాష్ట్రం వెస్ట్ గోదావరి జిల్లా వెల్పూ ర్‌కు వీరస్వామి మృతదేహన్ని తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరస్వామి వ్యవసాయ శాఖ అధికారిగా ప్రజలుకు ఎంతగానో సేవలందిచారు. ఆయన మృతి పట్ల మండల ప్రజలతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# నడిరోడ్డుపై నవమాసాల భారం



రైల్వే ఫ్లాట్‌ఫారం నుంచి శిశువును ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

**ప్రేమించిన పాపానికి కన్నవారి కాఠిన్యం**

**గర్భంతో వచ్చిన యువతికి పుట్టింట్లో నిరాకరణ**

**కళ్ల ముందే భర్తపై దాడి**

**అవమానభారంతో వదిలి వెళ్లిపోయిన భర్త**

**దిక్కులేని స్థితిలో వీధిన పడ్డ గర్భిణి**

**బిడ్డను స్వీకరించలేని తల్లి దైన్యం**

**శిశువిహార్‌కు చేరిన శిశువు**

**బాధితురాలికి ఆర్థిక సహాయం చేసిన స్థానిక నేతలు**

**గాంధీ ఆసుపత్రి నుండి తప్పించుకొచ్చిన 20 ఏళ్ల గర్భిణి**

**తాండూరు రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై అర్ధరాత్రి గంటకు పైగా ప్రసవ వేదన**

**మొర ఆలకించని 108 అత్యవసర సేవలు**

**ప్లాట్‌ఫారంపైనే ప్రసవం**

**బిడ్డ క్షేమం, తల్లి పరిస్థితి విషమం**

**ఆసుపత్రికి తరలించిన స్థానికులు, ఆటో డ్రైవర్లు**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 24, ప్రభాతవార్త :** గాంధీ ఆసుపత్రి నుంచి తప్పించుకొచ్చిన ఓ మహిళ తాండూరు రైల్వే ప్లాట్‌ఫారంపై ప్రసవించింది. అర్ధరాత్రి వేళ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆ మహిళ సుమారు గంట సేపు ప్రసవ వేదనకు గురైంది. నొప్పులు భరించలేక తల్లడిల్లగా పరిసరాల్లో ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు ఆమెను ఓదార్చరు. 108 వాహనానికి కాల్ చేసినా ఫలితం లేదు. కొంతసేపటికి ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. శిశువు క్షేమంగా ఉన్నా తల్లి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు రూరల్ మండలం జినుగర్తి గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతికి కొంతకాలం క్రితం ప్రేమ వివాహం జరిగింది. గర్భం దాల్చిన తర్వాత భర్తతో పుట్టింటికి రాగా వారి పెళ్లిని కుటుంబీకులు అంగీకరిం చలేదు. పైగా వారు ఆమె భర్తపై చేయి చేసుకున్నారని తెలిసింది. దాంతో భార్యను వదిలిపెట్టి భర్త వెళ్లిపోయాడని స్థానికులు చెబుతున్నారు. నిండు గర్భిణిగా ఉన్న ఆమె ఇల్లు విడిచి బయటకు వచ్చింది. ఇటీవల గౌతాపూర్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఆమెను చూసిన పోలీసులు, స్థానికులు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి బాగాలేదని గుర్తించిన వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె గాంధీ నుంచి తప్పించుకుని శనివారం రాత్రి తాండూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్రసవ వేదనతో ఆమె రోదనలు విన్న స్థానికులు 108 వాహనానికి పలు మార్లు కాల్ చేశారు. ఎలాంటి స్పందన లభించలేదని వారు తెలిపారు. కొంతసేపటికి ఆమె ప్రసవించడంతో అక్కడే ఉన్న ఆటోలో మహిళను, శిశువును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు గాంధీ ఆస్పత్రికి పంపింతే.. అక్కడి నుంచి ఎలా వచ్చిందని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలు అయోమయానికి గురయ్యారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరోసారి హైదరాబాద్ గాంధీకి తరలించారు. పుట్టిన బిడ్డను తాను స్వీకరించలేనని మహిళ చెప్పడంతో శిశువిహార్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతుల నాగరాజ్ తదితరులు ఆదివారం ఉదయం ఆసుపత్రికి చేరుకుని మహిళకు కొంత ఆర్థిక సహాయం అందజేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

# అకాల వర్షాల ముప్పు పొంచి ఉంది

**✦ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం ✦ రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండద్దు ✦ వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారీ**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 24, ప్రభాతవార్త:** అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా లోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదని, పంటలు తడవకుండా కొనుగో లు ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయా లని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైద రాబాద్, ఖమ్మం కలెక్టరేట్ల నుంచి ఉపము ఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమీక్షలో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్ర మాలు) అంశాలపై విస్తృతంగా చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ దీపక్ తివారి జిల్లా అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున జిల్లాలో కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎక్కువ సమయం నిరీక్షి ంచే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. మహిళా సంక్షేమ వారోత్సవాల కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జెడ్పీ సీఈఓ సుధీర్, డిఆర్డిఏ శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ అధికారులు సుదర్శన్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం దృష్టికి 'మహా సంగ్రామం'

**డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం**

**గాయకుడు నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డి**

**ఇబ్రహీంపట్నం, మే 24 ప్రభాతవార్త:** యువత భవిష్యత్తును అంధకారం చేస్తున్న డ్రగ్స్, గంజాయి సంస్కృతిని సమాజం నుండి పూర్తిగా తుడిచిపెట్టేందుకు బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో సాగుతున్న మహా సంగ్రామాన్ని త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రముఖ గాయకుడు నల్లగొండ గద్దర్ నర్సి రెడ్డి స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కోసం ఆదివారం బీఆర్ఆర్ సిఎం దృష్టికి 'మహా సంగ్రామం' ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డితో పాటు వందేమాతరం ఫౌండేషన్ మాధవరెడ్డి, ఎక్సైజ్ సిఐ ఎడుకొండలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బూడిద రామిరెడ్డితో కలిసి అతిథులు ఘనంగా సన్మా నిం చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. సమా జంలో క్యాన్సర్‌లా విస్తరిస్తున్న డ్రగ్స్, గంజాయి సంస్కృతిపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో బూడిద రాంరెడ్డి నేతృత్వంలో డ్రగ్స్ నియంత్రణకు, యువతను సన్మార్గంలో పెట్టేందుకు జరుగుతున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విజయం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి గట్టి చెంపపెట్టుగా నిలిచిందని కొనియాడారు.

# వైద్యం వికటించి..బాలుడి బలి..!

**షాద్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం**

**వాంతులని చేర్చితే రాత్రంతా ఉంచి నాసిరకం వైద్యం**

**పరిస్థితి విషమించడంతో చేతులెత్తేసిన వైద్యులు**

**హైదరాబాద్ తరలిస్తుండగా 12 ఏళ్ల మనీశ్వర్ మృతి**

**షాద్‌నగర్, మే 24, ప్రభాతవార్త :** వాంతులు అవుతున్నాయని ఆసుపత్రికి వస్తే, అవగాహన లేని నాన్ క్వాలిఫైడ్ వ్యక్తులు చేసిన వైద్యం ఒక బాలుడి ప్రాణాన్ని బలితీసుకుంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో నకిలీ, అర్హత లేని సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం, అధికారుల పర్యవేక్షణ కరువవ్వడం వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన రామచందర్ గత కొంత కాలంగా షాద్ నగర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. రామచందర్ కుమారుడైన 12 ఏళ్ల బాలుడు మనీశ్వర్‌కు శనివారం మధ్యాహ్నం వాంతుల వుతుండటంతో తల్లిదండ్రులు పట్టణంలోని బాలాజి ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. బాలుడిని అడ్మిట్ చేసుకున్న ఆసుపత్రి యాజమాన్యం,అక్కడ అందుబాటులో ఉన్న వ్యక్తులతో వైద్యం చేయించింది. శనివారం రాత్రంతా వారు ఇచ్చిన వైద్యం పనిచేయక పోవడం కారణంగా ఆదివారం తెల్లవారు జామున బాలుడి పరిస్థితి అత్యంత విషమంగా మారింది. పరిస్థితి చేతులు దాటిపోవడంతో బాలాజి ఆసుపత్రి సిబ్బంది చేతులెత్తేసారు. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని పట్టణంలోని గాయత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడి పల్స్ రేటు దారుణంగా పడిపోయిందని గుర్తించారు.



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

# మాతో సహా ఎవరు తప్పు చేసినా.. ప్రశ్నించాల్సిందే

**షాద్‌నగర్, మే 24, ప్రభాతవార్త :** పాలమూరు ప్రాజెక్టు పేరు చెప్పి రెండుసార్లు ఘనవిజయం సాధించి తరువాత మాట తప్పి కెసిఆర్ పాలమూరు ప్రజలకు ద్రోహం చేశాడు.. కానీ పాలమూరు బిడ్డగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరుకు న్యాయం చేస్తాడు.. పాలమూరు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేస్తాం.. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కలను సాకారం చేస్తాం.. అని రాష్ట్ర క్రీడలు, పాడి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణం లోని క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను పూర్తి చేయక పోతే ఏ నాయకుడైనా జీవితంలో ఏదో ఒకటి కోల్పోయినట్లే అని స్పష్టం చేశారు. కెసిఆర్ కు అడ్రస్ లేకపోయినా పాలమూరు జిల్లాలో ప్రాజె క్టు పూర్తి చేస్తాడని నమ్మి గెలిపించారని, కానీ కేవలం తమ అవినీతి కోసం ఈ ప్రాజెక్టును వాడుతున్నారని ఆరోపించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 21 స్టేజీలు నీళ్ల దిగుమతి చేసు కుంటామంటూ కేవలం 18 స్టేజీలకు పరిమితం చేశారని, 58 వేల కోట్లు మంజూరు అయితే కేవలం 28 వేల కోట్లు మాత్రమే ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారని విమర్శించారు. ప్రజా సంక్షేమం విషయంలో ఎవరు తప్పు చేసినా ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రజలపై ఉంటుందని, చివరికి తాము తప్పు చేసిన ప్రశ్నించాలని గుర్తు చేశారు.

**◆గత ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసింది**

**◆పాలమూరు ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేస్తాం..**

**◆భూసేకరణ వెంటనే మొదలవుతుంది..**

**◆మంత్రి వాకిటి శ్రీహరి..**

# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

**రంగారెడ్డి అర్బన్, మే 24 ప్రభాతవార్త :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊట్‌పల్లి గ్రామంలోని రాయల్ విల్లాస్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను పోలీసులు బట్టబయలు చేశారు. టీఎస్ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి 11 మంది నిందితులను అదుపులోకి తీసుకు న్నారు. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఊట్‌పల్లి గ్రామం, స్ట్రీట్ నెం.8 లోని రాయల్ విల్లాస్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో శంషాబాద్ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్కడ బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటున్న 11 మందిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు.దాడుల సమయంలో నిందితుల వద్ద నుంచి రూ.10 వేల నగదు, ఆన్‌లైన్ లావాదేవీలు మరియు బెట్టింగ్ నిర్వహణకు ఉపయోగిస్తున్న 43 సెల్ ఫోన్లు, 4 ల్యాప్‌టాప్‌లు, 3 స్కానర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా బజరంగ్ లాల్ శర్మను గుర్తించినట్లు సమాచారం. అతడు ఊట్‌పల్లిలో నివాసం ఉంటూ పాలిమర్ వ్యాపారం పేరుతో బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ వ్యవహారంపై శంషాబాద్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సి. రాఘవేందర్ ఫిర్యాదు మేరకు టీఎస్ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విజయ రహస్యాలు పంచుకుని..

**●ఆ నాటి అల్లరి గుర్తుచేసుకుంటూ..**

**ఘట్కేసర్ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సందడి**

**●55 ఏళ్ల అపూర్వ కలయికతో ఆనందోత్సాహం**

**●బడి రుణం తీర్చుకుంటా: ఓయూ విసి**

**ఘట్‌కేసర్ రూరల్, మే 24, ప్రభాతవార్త:** ఈర్ష్య, అసూయ, అహంకారాన్ని వీడితే, క్రమశిక్షణతో జీవితంలో అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చని ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ అన్నారు. పోచారం డివిజన్ అన్నోజిగూడలోని ఓ హోటల్‌లో ఘట్కేసర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 1970-71 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఘట్కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో చదివే వయసు ఎంతో కల్మషం లేనిదని, నాటి మధుర జ్ఞాపకాలు, ఆనందాలు మళ్లీ తిరిగి రావంటూ తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. అట్టడుగు స్థాయి నుండి పట్టుదల, నిరంతర శ్రమతో అహర్నిశలు చదవడం వల్లే తాను ఈ రోజు ఈ ఉన్నత స్థానానికి చేరుకోగలిగానని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కొండాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయిస్తానని వైస్ ఛాన్సలర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అలాగే ఘట్కేసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, రూ. 10,000 నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. దాదాపు 55 సంవత్సరాల క్రితం తాము పదవ తరగతిలో చేసిన అల్లరిని, నాటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా గుర్తుచేసు కున్నారు. తమ జీవిత చరమాంకంలో సాధించిన విజయాలను, కుటుంబ విషయాలను, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుం టూ రోజంతా సరదాగా గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బ్రహ్మం, తల్లం కోటేశ్వర్రావు, జయ ప్రకాశ్, ప్రసాద్, సాయిలు, రామమూర్తి, సుకన్య, జ్ఞానిభాయి, సరస్వతి, మీనాక్షి తదితరులు పాల్గొని సందడి చేశారు.



ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్‌తో పూర్వ విద్యార్థులు